## రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు : మంత్రి తుమ్మల



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 13,(ప్రజా జ్యోతి)** రాష్ట్ర ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఏర్పడే సకల విఘ్నాలను ఆ వినాయకుడు తొలగించాలని పరమ పవిత్రమైన వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరు ఇళ్లల్లో మట్టి వినాయకుడి తో, భక్తిశ్రద్ధలతో ఐక్యతతో పూజలు నిర్వహించాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. మట్టి వినాయకుడిని పూజించటం పర్యావరణానికి మేలు చేయటంతో పాటు మన సంస్కృతిని కాపాడుకుందాం అని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ వినాయక చవితి తెలుగు ప్రజలు అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నానని మంత్రి తుమ్మల ఆకాంక్షిస్తూ తన శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 14 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 7

## విఘ్నాలను తొలగించే వినాయకుడు..




- భక్తుల గణనాథుడు!
- బొజ్జ గణపయ్య ప్రతిష్ఠకు ఏర్పాట్లు
- ఇండ్లు, మండపాల్లో ప్రత్యేక పూజలు..
- భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు
- గణపతి నవరాత్రులకు శ్రీకారం..
- సందడిగా మారనున్న వీధులు
- నేడే వినాయక చవితి..

2 లో...

# అశ్వాపురానికి బస్టాండ్ ఎప్పుడో?

- ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు మారుతున్నా.. ప్రజల బస్టాండ్ కష్టాలు మాత్రం తీరడం లేదు



**అశ్వాపురం:సెప్టెంబర్13, ప్రజాజ్యోతి** మండల కేంద్రంగా అశ్వాపురం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజల ప్రాథమిక అవసరాల్లో ఒకటైన బస్టాండ్ సౌకర్యం మాత్రం అందని ద్రాక్షగానే మారింది. ప్రభుత్వాలు మారుతున్నా.. ప్రజా ప్రతినిధులు మారుతున్నా.. ఏళ్లుగా కొనసాగుతున్న బస్టాండ్ సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం లభించడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ ఉన్నట్టుగా కనిపిస్తున్నా.. ప్రయాణికులకు ఉపయోగపడే పరిస్థితి లేకపోవడంతో పేరుకే బస్టాండ్‌గా మారిందని ప్రజలు వాపోతున్నారు. అశ్వాపురం మార్కెట్ వీధిలో ఉన్న బస్టాండ్ ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నట్లు ప్రజలు చెబుతున్నారు. మార్కెట్ వీధి ఇరుకుగా ఉండటంతో బస్సులు లోపలికి వచ్చి సక్రమంగా నిలిపేందుకు, తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు మార్కెట్ ప్రాంతంలో నిత్యం ప్రజల రద్దీ, వాహనాల రాకపోకలు ఉండటంతో ప్రయాణికులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రజలు రోడ్డు పక్కనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**వర్షం వస్తే ప్రయాణికుల పాట్లు**

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రయాణికుల కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. బస్సు కోసం వేచి ఉండేందుకు సరైన షెడ్డు లేకపోవడంతో వర్షం పడితే

మిగతా 2 లో...

## కలెక్టరేట్ లోనే ఫేక్ రేషన్ కార్డు దందా




- జిల్లా కలెక్టర్ సాబ్ ఏం చేస్తున్నట్లు..?
- కలెక్టరేట్ కే మచ్చ తెచ్చిన బండి మధు..! నిద్రపోతున్న కలెక్టరేట్ యంత్రాంగం...
- ఏకంగా కలెక్టర్ పేరుతోనే టోకరా..! అయినా చీమకుట్టనట్లు అధికారుల తీరు...
- కలెక్టరేట్ లో ఫేక్ ఐడీ చెల్లుబాటు అవుతుందా..?
- చెల్లితే మరికొన్ని కార్డులు పుట్టకొస్తాయా...?
- లక్షల దోపిడీ జరిగింది కలెక్టరేట్ లోనే - ఇది నిర్లక్ష్యమా.? వాటాల లెక్కానా..?
- బాధితుల కన్నీళ్లు కలెక్టరేట్ లో ఎవరికి పట్టవా..?
- కలెక్టరేట్ పరువు బజారులో పెట్టిన మోసగాడు.. ఇప్పటికైనా కలెక్టర్ చర్యలు తీసుకుంటారా..?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 13, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ పేరు చెప్పుకుని, ఫేక్ ఐడీ సృష్టించి అమాయకుల నుంచి రేషన్ కార్డుల పేరుతో వేల రూపాయలు వసూలు చేసిన బండి మధు అనే వ్యక్తిపై ఇప్పటివరకు ఎటువంటి చర్యలు లేకపోవడం జిల్లాలో పలు అనుమానాలకు

మిగతా 2 లో...

## వ్యర్థాల టెండర్‌పై కమిషనర్ మౌనం ఎందుకు?

- రూ.5 వేల డిపాజిట్‌తోనే సరిపెట్టారా.. టెండర్ నిబంధనలు పాటించారా?



**ఆశ్వారావుపేట, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి):** అశ్వారావుపేట మున్సిపాలిటీలో చికెన్ వ్యర్థాల సేకరణ, తరలింపు, నిర్వహణకు సంబంధించి మున్సిపల్ అధికారులు అనుసరించిన విధానంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్ ప్రక్రియలో పాల్గొన్న కాంట్రాక్టర్ నుంచి కేవలం

మిగతా 2 లో...

## కలెక్టరేట్ లోనే ఫేక్ రేషన్ కార్డు దందా...




(మొదటి పేజీ తరువాయి...)
తావిస్తోంది. ఈ దందాపై ఇటీవల ప్రజాజ్యోతి పత్రికలో కథనం వచ్చినా, బాధితులు బహిరంగంగా ఫిర్యాదులు చేసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దేనికి సంకేతమని జిల్లా వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఫేక్ ఐడీతో వేలకు వేలు వసూళ్లు...**

ఏకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే తాను జూనియర్ అసిస్టెంట్ నంటూ నకిలీ ఐడీ కార్డుతో తిరుగుతూ, రేషన్ కార్డులు ఇప్పిస్తానని నమ్మించి ఒక్కొక్కరి దగ్గర నుంచి వేలకు వేలు వసూలు చేసిన ఘటనపై కలెక్టరేట్ వర్గాల్లో కలకలం రేగింది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులకు చలనం లేకపోవడం చూస్తే ఇందులో అధికారులకు కూడా వాటాలు ఉన్నాయా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. బాధితులు లబోదిబోమంటున్నా పట్టించుకోకపోవడం వెనుక పెద్దల హస్తం ఉందా అనే చర్చ జరుగుతోంది.

**నకిలీ ఉద్యోగిగా చెలామనైనా అరెస్ట్ లేదా..!**

ప్రభుత్వ వ్యవస్థకే తలమానికమైన కలెక్టరేట్ పేరును అడ్డుపెట్టుకుని ఇలాంటి మోసాలకు పాల్పడటం ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించడమే తెలుస్తోంది. నకిలీ ఉద్యోగిగా చెలామణి అవుతూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని ఇప్పటికీ అరెస్ట్ చేయకపోవడం, విచారణ జరపకపోవడం అధికార యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగి, ఈ వ్యవహారంపై లోతైన విచారణ జరిపించి, బండి మధుపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అతనికి సహకరిస్తున్న అధికారులు ఎవరైనా ఉంటే వారిని కూడా బయటకు తీసి శిక్షించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## వ్యర్థాల టెండర్‌పై కమిషనర్ మౌనం ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి...)
రూ.5 వేల డిపాజిట్ మాత్రమే తీసుకున్నారా? లేక టెండర్ నిబంధనల ప్రకారం అదనంగా ఏదైనా భద్రతా డిపాజిట్ వసూలు చేశారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కమిషనర్ అండగా ఉండగా ఎందుకు తొందర?**

కమిషనర్ను ఏ విషయం పైన అడిగినా ఆయన చెప్పే సమాధానం ఒకటే మౌనం ఆ మౌనానికి కారణం ఏమిటో అర్థం కాని ప్రశ్న.

**మౌనం అర్ధాంగికారమా**

చికెన్ వ్యర్థాల కాంట్రాక్టు విలువ సుమారు రూ.10.50 లక్షలుగా పేర్కొంటున్న నేపథ్యంలో, అందుకు అనుగుణంగా డిపాజిట్, భద్రతా రుసుము, ఇతర నిబంధనలు అమలు చేశారా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు ట్రేడ్ లైసెన్స్, వ్యర్థాల నిర్వహణకు అవసరమైన అనుమతులు, ప్రాసెసింగ్ యూనిట్ వంటి అంశాలను పరిశీలించారా లేదా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న . ఈ వ్యవహారంపై మున్సిపల్ కమిషనర్ వివరణ ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. టెండర్ నిబంధనలు, డిపాజిట్ వివరాలు, కాంట్రాక్టు అప్పగింతకు సంబంధించిన రికార్డులను బహిర్గతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు : కూనంనేని

**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబరు 13 ,(ప్రజా జ్యోతి)** గణేష్ పండుగను జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో, సుఖ సంతోషాలతో, ఐక్యతతో జరుపుకోవాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రుల సందర్భంగా ఉత్సవ మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఆయా ఉత్సవ కమిటీ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని



కోరారు ,అదేవిధంగా వర్షాకాలం సందర్భంగా మండపాల వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ వలన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు, మండపాల వద్ద డీ జే లు వాడకుండా నిర్వాహకులు చూడాలని, తొమ్మిది రోజులపాటు ప్రశాంత వాతావరణంలో గణేష్ పండగను విజయవంతంగా జరుపుకోవాలని కోరుతూ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# విఘ్నాలను తొలగించే వినాయకుడు..

**ఇల్లందు, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి):** విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి ఆరాధనకు వేళైంది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణాలు, గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గణనాథుడిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించేందుకు భక్తులు, ఉత్సవ కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వినాయక చవితి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. హిందూ సంప్రదాయంలో ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా గణపతిని పూజించడం ఆనవాయితీ. అందుకే ఆయనను ఆదిదేవుడిగా, విఘ్నేశ్వరుడిగా, గణనాథుడిగా, గజాననుడిగా భక్తులు కొలుస్తారు. గణపతిని పూజిస్తే కార్యాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తవుతాయని భక్తుల విశ్వాసం.

### »» పురాణాల్లో గణపతి జన్మ కథ

పురాణ కథనాల ప్రకారం పార్వతీదేవి తన దేహానికి పూసుకున్న పసుపుతో బాలుడిని రూపొందించి ప్రాణం పోసిందని చెబుతారు. తనకు కాపలాగా ఉండాలని ఆ బాలుడిని నియమించింది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన పరమశివుడిని బాలుడు అడ్డుకోవడంతో పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. అనంతరం శివుడు బాలుడి శిరస్సును తొలగించగా, పార్వతీదేవి ఆగ్రహించి తన కుమారుడిని తిరిగి ప్రాణాలతో చూడాలని కోరిందని పురాణాలు చెబుతున్నాయి. దీంతో శివుడు ఏనుగు తలను అమర్చి బాలుడికి పునర్జీవం ప్రసాదించాడని, అప్పటి నుంచి గజాననుడిగా పూజలు అందుకుంటున్నాడని భక్తుల విశ్వాసం.

### »» పూజలో ఉండ్రాళ్లకు ప్రత్యేకత

వినాయకుడికి ఇష్టమైన నైవేద్యాల్లో ఉండ్రాళ్లు, కుడుములు, మోదకాలు ప్రధానమైనవిగా భావిస్తారు. ఇంట్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పిండి వంటకాలను తయారు చేసి గణనాథుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. పత్రి పూజకు కూడా వినాయక చవితిలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది.

### »» 21 రకాల పత్రితో పూజ

వినాయకుడి పూజలో వివిధ రకాల ఆకులు, పత్రాలను ఉపయోగించడం సంప్రదాయంగా వస్తోంది. పత్రితో గణపతిని పూజించడం వల్ల ప్రకృతి ప్రాధాన్యతను కూడా గుర్తుచేసినట్లవుతుంది. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేలా పండుగను నిర్వహించాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

### »» వాడవాడలా గణనాథుడి ప్రతిష్ఠ

వినాయక చవితి సందర్భంగా వీధులు, కాలనీలు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేశారు. మండపాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భారీ విగ్రహాలతో పాటు వివిధ రూపాల్లో గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

### »» ఇళ్లలోనూ ప్రత్యేక పూజలు

మండపాల్లోనే కాకుండా అనేక కుటుంబాలు తమ ఇళ్లలో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులంతా కలిసి గణపతి పూజలో పాల్గొని ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని కోరుకుంటారు.



### »» చిన్నారులు, యువతకు ప్రత్యేక ఉత్సాహం

వినాయక చవితి అంటే చిన్నారులు, యువతలో ప్రత్యేక ఉత్సాహం కనిపిస్తుంది. కొత్త దుస్తులు ధరించి గణపతి మండపాలకు వెళ్లడం, పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించడం వంటి వాటితో పండుగ వాతావరణం మరింత సందడిగా మారుతుంది.

### »» భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

వినాయకుడిని ప్రతిష్ఠించిన అనంతరం పలు ప్రాంతాల్లో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### »» పర్యావరణహిత వినాయకుడే మేలు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని పలువురు సూచిస్తున్నారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. భక్తి భావంతో పాటు పర్యావరణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. గణనాథుడి పూజతో తమ జీవితాల్లోని విఘ్నాలు తొలగిపోయి కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని భక్తులు కోరుకుంటున్నారు. పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా ప్రతి చోటా “గణపతి బప్పా మోరియా” నినాదాలు మార్మోగనున్నాయి. భక్తి, ఐక్యత, ఆనందాన్ని చాటుతూ వినాయక చవితి వేడుకలు ఘనంగా జరగనున్నాయి.

### »» శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలి:పోలీస్ శాఖ

వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖ సూచిస్తుంది. వినాయక మండపాలు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే అయ్యా పోలీస్ స్టేషన్ పరిధిలో అధికారులు గణేష్ మండపాల నిర్వహకులతో సమావేశ నిర్వహించి జాగ్రత్తలు వహించాలని, ఇలాంటి ఘర్షణలకు తావు లేకుండా గణేష్ నవరాత్రులను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. డీజే బాక్సులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని పేర్కొన్నారు. ముఖ్యంగా నిమర్జనం సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, శబ్ద కాలుష్యం పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని, నిమజ్జనం సమయంలో కూడా సంబంధిత అధికారుల సూచనలు పాటిస్తూ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.

## అశ్వాపురానికి బస్టాండ్ ఎప్పుడో?

(మొదటి పేజీ తరువాయి...)
ప్రయాణికులు తడుస్తూ నిలబడాల్సి వస్తోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం నుంచి రక్షణ పొందేందుకు సరైన స్థలం లేకపోవడంతో సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సులు ఆలస్యమైన సమయంలో ప్రయాణికుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. రోడ్డు పక్కన నిలబడటంతో వాహనాల రాకపోకల మధ్య ప్రమాదాల భయం కూడా వెంటాడుతోందని ప్రజలు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో సరైన వసతులు లేక మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మండల ప్రజలకు రవాణా ఇబ్బందులు**

అశ్వాపురం మండల పరిధిలోని అనేక గ్రామాల నుంచి ప్రతిరోజూ ప్రజలు విద్య, వైద్యం, ఉద్యోగాలు, వ్యాపారాలు, ప్రభుత్వ కార్యాలయాల పనుల కోసం మండల కేంద్రానికి వస్తుంటారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు బస్సు రవాణాపైనే ఆధారపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే



రైతులు, కూలీలు కూడా ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న మండల కేంద్రంలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన బస్టాండ్ లేకపోవడం దురదృష్టకరమని ప్రజలు అంటున్నారు. బస్సులు ఎక్కడ ఆగుతాయో, ప్రయాణికులు ఎక్కడ వేచి ఉండాలో స్పష్టత లేకపోవడంతో ప్రతిరోజూ గందరగోళ పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు.

**పత్రికల్లో వచ్చినా.. సమస్య పరిష్కారం కాలేదు**

అశ్వాపురం బస్టాండ్ సమస్యను గతంలో పలుమార్లు పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల ఇబ్బందులను అధికారులు పరిశీలించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజా సమస్యలను కేవలం పత్రికల్లో వచ్చిన వార్తలుగా కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఎన్నేళ్లుగా ఇదే సమస్య కొనసాగుతున్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**శాశ్వత బస్టాండ్ నిర్మించాలి**

అశ్వాపురం మండల కేంద్రంలో బస్సుల రాకపోకలకు అనువైన ప్రాంతాన్ని అధికారులు గుర్తించి శాశ్వత బస్టాండ్ నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు కూర్చునే బెంచీలు, వర్షం–ఎండ నుంచి రక్షణ కల్పించే షెడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వెలుగులు వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే బస్సులు సులభంగా రాకపోకలు సాగించేలా రహదారి వెడల్పు, ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ వంటి అంశాలను కూడా అధికారులు పరిశీలించాలని ప్రజలు సూచిస్తున్నారు. అశ్వాపురం అభివృద్ధికి అనుగుణంగా రవాణా సౌకర్యాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అంటున్నారు. “అయ్యా.. మా పరిస్థితి జర చూడండి సారు. ప్రభుత్వాలు మారుతున్నా మా బస్టాండ్ కష్టం మాత్రం తీరడం లేదు. వర్షం వస్తే పిల్లలతో నిలబడేందుకు కూడా చోటు లేదు. ఇకనైనా అధికారులు స్పందించి అశ్వాపురానికి అన్ని సౌకర్యాలతో కూడిన శాశ్వత బస్టాండ్ ఏర్పాటు చేయాలి” అని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# లక్ష్మీదేవిపల్లిలో యువకుడిపై దాడి

- ఫోన్ పే ద్వారా రూ.31 వేలు బదిలీ చేయించుకున్న దుండగులు...
- మద్యం అలవాట్ల కోసం దోపిడీ ప్లాన్...
- ఎట్టకేలకు ఛేదించిన లక్ష్మీదేవిపల్లి పోలీసులు...
- యువకుడి దోపిడీ కేసులో ఆరుగురు అరెస్ట్...
- మరో ఇద్దరి కోసం ముమ్మరంగా గాలింపు...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / లక్ష్మీదేవిపల్లి సెప్టెంబర్ 13, ప్రజాజ్యోతి...** లక్ష్మీదేవిపల్లిలో ఓ యువకుడిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు.ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 30వ తేదీన జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఒక యువకుడిని నమ్మించి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి, దాడి చేసి సెల్ ఫోన్ లాక్కొని ఫోన్ పే ద్వారా డబ్బులు బదిలీ చేసుకున్న కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం.. ఏ–1 బానోత్ అఖిల్, ఏ–2 పరండికి శ్రీరామ్, ఏ–3 గుగులోతు చరణ్ @ చరణ్ తేజ్, ఏ–4 చీకుళ్ళ వరుణ్ తేజ్, ఏ–5 తేజావత్ హిమ్ము, ఏ–6 జగతాని ఉపాసలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 4 సెల్ ఫోన్లు, రూ.13,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరూ స్నేహితులు కాగా, మద్యం తదితర చెడు అలవాట్లకు డబ్బులు అవసరమై అమాయక వ్యక్తులను టార్గెట్ చేసి దోపిడీ చేయాలని పథకం వేసుకున్నారని తెలిపారు. ప్లాన్ ప్రకారం ఏ–1 బాధితుడిని నమ్మించి బ్రేక్ ఫాస్ట్ గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుకకు తీసుకెళ్లగా, మిగిలిన వారు అక్కడ వేచి ఉండి దాడి చేసి, సెల్ ఫోన్ పాస్ వర్డ్, ఫోన్ పే వివరాలు బెదిరించి తీసుకుని అతని ఖాతా నుండి రూ.31,000 వివిధ ఫోన్ పే ఖాతాలకు బదిలీ చేసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇటువంటి ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారు సూచించారు. కేసును ఛేదించిన లక్ష్మీదేవిపల్లి పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అభినందించారు.

## మణుగూరు అంబేద్కర్ సెంటర్ లో పోలీసుల వాహన తనిఖీలు

- పెండింగ్ చలానాల రికవరీకి పోలీసుల స్పెషల్ డ్రైవ్...
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు పోలీసుల సూచన...



**మణుగూరు క్రైమ్, సెప్టెంబర్ 13, ప్రజాజ్యోతి :** – మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఆదివారం రోడ్డు భద్రత, పెండింగ్ లో ఉన్న చలానాల రికవరీలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారని పోలీసులు తెలిపారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లను ఆపి పత్రాలను పరిశీలించారు. హెల్మెట్ లేకుండా, సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనదారులకు జరిమానాలు విధించారు. పెండింగ్ చలానాలు ఉన్న వారి నుండి అక్కడికక్కడే రికవరీ చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మణుగూరులో పట్టుబడిన అక్రమ రేషన్ బియ్యం

- ట్రాలీలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యం సీజ్ చేసిన పోలీసులు
- ప్రజా పంపిణీ బియ్యం మాఫియా గుట్టురట్టు...ట్రాలీ స్వాధీనం...




**మణుగూరు క్రైమ్, సెప్టెంబర్ 13, ప్రజాజ్యోతి :** – భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణాను ఆదివారం పోలీసులు అడ్డుకున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా ట్రాలీలో తరలిస్తుండగా పోలీసులు పక్క మాటువేసి పట్టుకున్నారు. రహస్య సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టగా ఈ అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంతో పాటు ట్రాలీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ట్రాలీని మణుగూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ బియ్యం ఎక్కడి నుండి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉందనే దానిపై దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఆరుగాలం శ్రమకు అకాల వర్షం గండం

- నీట మునిగిన పొలాలు.. రైతుల ఆవేదన



**భద్రాద్రి కొత్తగూడెం, సుజాతనగర్, సెప్టెంబర్ 13:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. పలుచోట్ల పత్తి, మొక్కజొన్న పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా నీటి పారుదల సౌకర్యాలు సరిగా లేని ప్రాంతాల్లో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఈదురు గాలుల వల్ల పత్తి, మొక్కజొన్న పొలాలు నేలమట్టం అయ్యాయి. కాగా పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి మొక్కల చుట్టూ నీరు నిలవడంతో వేర్లకు గాలి అందక మొక్కలు వాడిపోవడం, పసుపు రంగులోకి మారడం, కుళ్లిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. మరోవైపు మొక్కజొన్న పంటలోనూ అధిక తేమ కారణంగా మొక్కలు నేలకొరిగి దిగుబడిపై ప్రభావం పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. "పంట సాగు కోసం విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీలకు వేలాది రూపాయలు ఖర్చు చేశామని రైతులు వాపోతున్నారు . ఇప్పుడు వర్షం కారణంగా పంటలు నేలపాలు కావడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి.

## ప్రతి విద్యార్థికి చదువే పోరాటం కావాలి

- ఘనంగా శ్రీవిద్య - కృష్ణవేణి ఫ్రెషర్స్ డే వేడుకలు...
- విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి...
- విద్య సంస్థల కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్...
- స్నేహ గార్డెన్స్ లో సాంస్కృతిక నృత్యాలతో అలరించిన విద్యార్థులు...





**భద్రాద్రి కొత్తగూడెం క్రైమ్ ప్రతినిధి /మణుగూరు. సెప్టెంబర్ 13, ప్రజాజ్యోతి :** – విద్యార్థులు తమ జీవిత గమ్యం కోసం చదువుతోనే పోరాటం చేసి ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్య సంస్థల కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్ అన్నారు. ఆదివారం మణుగూరు మండల కేంద్రంలోని స్నేహ గార్డెన్స్ లో శ్రీవిద్య – కృష్ణవేణి విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తు లో ఉన్నత స్థాయిలో మంచి మార్కులు సాధించాలని, సమాజ పరిస్థితులకు అనుగుణంగా జీవించాలని ఆయన సూచించారు. యువత చెడు వ్యసనాల కు బానిసలు కాకుండా మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విద్యా సంస్థల కరస్పాండెంట్లు బద్దం శ్రీనివాస్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సారంగపాణి, ప్రిన్సిపాల్ పి. నాగేశ్వరరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మట్టి గణనాథుల పంపిణీకి శ్రీకారం.. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట!





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సుజాతనగర్, సెప్టెంబర్ 13, ప్రజా జ్యోతి:** – వినాయక చవితి సందర్భంగా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మట్టి గణనాథుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పెద్ద సంఖ్యలో మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు అందుబాటులో ఉంచారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా భక్తితో పాటు ప్రకృతిని కూడా కాపాడుకోవచ్చని అధికారులు, నిర్వాహకులు సూచించారు.మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరులకు కాలుష్య ముప్పు తగ్గుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత వినాయకుడినే ప్రతిష్ఠించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.వినాయక చవితి సందర్భంగా "మట్టి గణపయ్యను ప్రతిష్ఠిద్దాం.. మన పర్యావరణాన్ని కాపాడుకుందాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు.భక్తి ఉండాలి.. పండుగ జరగాలి.. అదే సమయంలో ప్రకృతిని కూడా కాపాడాలి అనే చైతన్యాన్ని ఈ మట్టి గణనాథుల పంపిణీ కార్యక్రమం చాటిచెప్పింది.

## ఎమ్మెల్యే పాయం కృషితోనే నియోజక వర్గం అభివృద్ధి

- **పినపాకకు నిధులు తేవడం పట్ల హర్షం**
- **జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గొడిశాల రామనాధం**



**పినపాక, సెప్టెంబర్ 13(ప్రజాజ్యోతి)** రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా పినపాక శాసన సభ్యులు నియోజకవర్గం అభివృద్ధికి నిధులు తీసుకురావడం పట్ల, కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి జిల్లా ఉపాధ్యక్షులు గుడిశాల రామనాథం హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం రామనాధం ఓ ప్రకటన విడుదల చేసారు. నియోజకవర్గ అభివృద్ధికి 186 కోట్ల రూపాయల నిధులు తీసుకురావడం పట్ల ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా, అభివృద్ధి అంటేనే పాయం అన్నట్టుగా ఎమ్మెల్యే ఎంతో చిత్తశుద్ధితో పని చేస్తూ, ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో చర్చించి, ఒప్పించి భారీ స్థాయిలో నిధులు తీసుకొని వచ్చారని అన్నారు. పినపాకలోని ఏడు ఏజెన్సీ మండలాల్లో తాగునీరు, రోడ్లు, వంతెనల మరమ్మత్తులు, ఇతర సౌకర్యాల కల్పనకు నిధులు ఉపయోగిస్తామని అన్నారు.

## మండల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

- **ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలి: పర్స వెంకట్**



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 13, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల ప్రజలకు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్స వెంకట్ తెలిపారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని కోరారు. మండల ప్రజలంతా ఐకమత్యంతో పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ప్రజల జీవితాల్లో అన్ని విఘ్నాలు తొలగి, సుఖశాంతులు, అభివృద్ధి కలగాలని వినాయకుడిని ప్రార్థిస్తున్నట్లు పర్స వెంకట్ పేర్కొన్నారు.

## శంకరాచారి మృతికి ఉప సర్పంచ్‌ల ఫోరం నేతల సంతాపం

- **వీడియో కాల్‌లో కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్**



**బూర్గంపహాడ్, సెప్టెంబరు 13 (ప్రజా జ్యోతి):** టేకులపల్లి మండల ఉప సర్పంచ్ వసంత లక్ష్మి భర్త శంకరాచారి మృతి పట్ల ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహంకాళి రామారావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం శంకరాచారి కుటుంబాన్ని పరామర్శించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. శంకరాచారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మహంకాళి రామారావు మాట్లాడుతూ శంకరాచారి మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి ఉప సర్పంచ్‌ల ఫోరం తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అనంతరం ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్‌తో వీడియో కాల్‌లో కుటుంబ సభ్యులను మాట్లాడించారు.ఈ సందర్భంగా బొట్ల కార్తీక్ శంకరాచారి మృతికి సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.క్లిష్ట సమయంలో కుటుంబానికి అవసరమైన సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ పరామర్శ కార్యక్రమంలో బూర్గంపహాడ్ మండల ఫోరం అధ్యక్షుడు బి. మోహన్‌రావు,మండల ఉపాధ్యక్షుడు తోటమళ్ల వెంకటరమణ,ఉప సర్పంచ్‌లు రాధాకృష్ణ మోతె,బేబీ తాళ్లగొమ్మూరు, జయశ్రీ అంజనాపురం, గుండాల ఉప సర్పంచ్ తాటి రమేష్, టేకులపల్లి మండలానికి చెందిన ఉప సర్పంచ్‌లు, జిల్లా బీసీ సంఘం జిల్లా కార్యదర్శి బెజ్జంకి కనకాచారి,విద్యార్థి నాయకుడు గోపి తదితరులు పాల్గొని శంకరాచారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# ఆగని వినాయక విగ్రహాల కల్తీ వ్యాపారం

- **కథనం రాసినా మారని తీరు...!**
- **యథేచ్ఛగా కెమికల్ వినాయక విగ్రహాల దందా...**
- **అధికారులకు ముడుపులు..ప్రజల ప్రాణాలతో చెలగాటం..!**
- **పర్యావరణానికి ముప్పు తెస్తున్న పీఓపీ గణపతి విగ్రహాలు...**
- **వేలకు వేలు దండుకుంటున్న తయారీ వ్యాపారులు...**
- **చర్యలు శూన్యం..వ్యాపారులకే వంతపాడుతున్న అధికారులు...**
- **కెమికల్ రంగులతో కలుషితమవుతున్న గోదావరి...**
- **ప్రభుత్వ నిబంధనలు**









### పూర్తిగా తుంగలోకి...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు సెప్టెంబర్ 12, ప్రజాజ్యోతి**

వినాయక విగ్రహాల్లో కెమికల్ కల్తీపై రెండు రోజుల క్రితం ప్రజాజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురించినా వ్యాపారుల తీరులో ఏమాత్రం మార్పు రాలేదు. పైగా మరింత బరితెగించి అధికారులకు ముడుపులు ముట్టజెప్పి, నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ), కెమికల్ రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఒక్కో విగ్రహాన్ని రూ.8 వేల నుండి రూ.40 వేల వరకు అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే విక్రయించాలని, పీఓపీ విగ్రహాలను నిషేధిస్తూ ప్రభుత్వం, కాలుష్య నియంత్రణ మండలి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా జిల్లాలో వాటి అమలు కాగితాలకే పరిమితమైంది.వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై కెమికల్ విగ్రహాలను బహిరంగంగానే రోడ్లపై, ప్రధాన కూడళ్లలో పెట్టి అమ్ముతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం.చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు చేసి వ్యాపారస్తులకే మద్దతు పలుకుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కెమికల్ విగ్రహాల నిమజ్జనం వల్ల జలాశయాలు, గోదావరి నది తీవ్రంగా కలుషితమవుతున్నాయని, నీటిలో కరిగే కెమికల్ రంగుల వల్ల జలచరాలు మృత్యువాత పడుతున్నాయని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. అధిక ధరలకు ఈ విషపూరిత విగ్రహాలను కొని పూజిస్తే ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతాయని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి కెమికల్ విగ్రహాలను సీజ్ చేసి, విక్రయిస్తున్న వ్యాపారులపై, వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

- **సిపిఐ అశ్వరావుపేట మండల సమితి**



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 13, ప్రజా జ్యోతి** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను (సెప్టెంబర్ 11 -17) పురస్కరించుకుని సిపిఐ అశ్వరావుపేట మండల సమితి ఆధ్వర్యంలో ఆదివారం సిపిఐ నియోజకవర్గ కార్యాలయం రజబ్ అలీ భవన్ వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. సిపిఐ అశ్వరావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సయ్యద్ సలీం మాట్లాడుతూ: తెలంగాణ సాయుధ పోరాటం భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరీ, నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. పేద రైతులు, కూలీలు, మహిళలు, గిరిజనులు, అణగారిన వర్గాలు ఎదుర్కొన్న దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించారని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం తెలంగాణ రైతాంగం సాగించిన పోరాటం దేశ చరిత్రలోనే గొప్ప ప్రజా ఉద్యమంగా నిలిచిందన్నారు. భూస్వాముల పెత్తనం, అక్రమ వసూళ్లు, వెట్టి చాకిరీ వంటి దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పేద ప్రజలు ధైర్యంగా పోరాడారని, ఈ పోరాటంలో అనేక మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలు కూడా కీలక పాత్ర పోషించారని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యపరచడంలో, ఉద్యమానికి అండగా నిలవడంలో వారు చూపిన ధైర్యం, త్యాగం స్ఫూర్తిదాయకమని అన్నారు. పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలను నేటి తరం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అశ్వరావుపేట నియోజకవర్గంలో కూడా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల భూ హక్కుల కోసం సిపిఐ నిరంతరం పోరాడిందని సయ్యద్ సలీం తెలిపారు. అశ్వరావుపేట నియోజకవర్గంలో కొన్ని వేల ఎకరాల భూమిని పేద బడుగు బలహీన వర్గాలకు పంచిపెట్టిన చరిత్ర సిపిఐ పార్టీకి ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో నేటికీ ప్రజా సమస్యలపై ఉద్యమాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కార్మికులకు ఉపాధి, పేదలకు ఇళ్ల స్థలాలు, భూమిలేని వారికి భూమి, కార్మికులకు కనీస వేతనాలు, యువతకు ఉపాధి వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగాలను కేవలం జ్ఞాపకం చేసుకోవడం మాత్రమే కాకుండా, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని అన్నారు. దోపిడీ, అసమానతలు లేని సమాజం కోసం ఐక్యంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గన్నిన రామకృష్ణ, మండల కార్యదర్శి వగ్గెల అర్జునరావు, చీపుర్ల సత్యవతి, శ్రావణి, సజ్జ శ్రీను, చెన్నారావు, వాసు, వెంకన్న, విష్ణు, రాధ,పురుషోత్తం, ప్రసాద్, భాష,మహాలక్ష్మి మరియు అశ్వరావుపేట సీపీఐ మండల సమితి నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు

## వనవాసీలో భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ



**చర్ల, సెప్టెంబర్ 13: (ప్రజా జ్యోతి ):** వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం–శబరి విద్యార్థి నిలయంలో ఆదివారం సరస్వతీ పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పురోహితులు కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, నిలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి అఖిల భారతీయ వనవాసీ కళ్యాణ పరిషత్ కార్యకారిణి సభ్యులు కొరిగింజ రామచంద్రయ్య హాజరయ్యారు. విద్యార్థుల్లో చదువుపై ఏకాగ్రత పెరగడంతో పాటు సరస్వతీ దేవి కరుణాకటాక్షాలతో వారు విద్యలో ఉన్నత స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం సరస్వతీ పూజ నిర్వహిస్తున్నట్లు రామచంద్రయ్య తెలిపారు.ఈ సందర్భంగా పురోహితులు కార్తీక్ విద్యార్థుల గోత్రనామాలను చదివి, వారి చేత గణపతి, సరస్వతీ దేవతలను ఆవాహనం చేయించారు. అనంతరం పసుపు, కుంకుమ, అక్షతలతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. విద్యార్థులు సామూహికంగా హారతి పాటలు, శ్లోకాలు ఆలపించి పూజా కార్యక్రమాన్ని ముగించారు. అనంతరం సామూహిక అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వనవాసీ మహిళా ప్రాంత సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, కొమరం భీం నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, శివరాజు కిషోర్, సుజాత, నిలయ ప్రముఖులు వరలక్ష్మి, సంతోష్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నిజాం ప్రభుత్వాన్ని కూల్చిన ఘనత కమ్యూనిస్టులదే

- నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి
- రాష్ట్ర ప్రభుత్వం విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 13, (ప్రజాజ్యోతి)** రజాకారుల మూకలను తరిమికొట్టి తెలంగాణకు విముక్తి కలిగించింది కమ్యూనిస్టులేనని, అదే స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న నేటి పాలకులను తరిమికొట్టాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి SK సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ ఎదుట అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వార్షికోత్సవ సభ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ పాత్ర ఎంతో ఉందని, భూమి కోసం, భుక్తి కోసం, అణగారిన వర్గాల కోసం ముఖ్యంగా రైతుల సమస్యల గురించి, రజాకారుల రాజకీయ పాలనను అంతమొందించడంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. 1947 సెప్టెంబర్ 11న అమరవీరులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖుం మోహియుద్దీన్ పిలుపుతో మహోద్యమం ప్రారంభం అయ్యిందని, అన్నారు , తెలంగాణ సాయుధ పోరాటంలో ఇసుక రేణువంత పాత్ర కూడా బిజెపికి లేదని, ఈ పోరాటాన్ని తామే చేసినట్లుగా చెప్పుకోవడం, ఉత్సవాలకు సిద్ధం కావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదిలక్షల ఎకరాల భూమిని ఈ పేదలకు పంచిన ఘనత సిపిఐ కే దక్కుతుందని తెలిపారు. గత పది ఏళ్లగా నియంతలాగా వ్యవహరించిన గత ప్రభుత్వం విలీన దినోత్సవం అధికారికంగా నిర్వహించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అయిన విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. అనంతరం ఈ సేవ సెంటర్ వద్ద సాయుధ పోరాట యోధులు ఉషారావు, రామకోటయ్యల స్థూపం, అమరవీరులు సిద్ధి వెంకటేశ్వర్లు, ఉప్పుశెట్టి ఖాదర్ బాబు, దేవభక్తిని రమేష్, చంద్రశేఖర్, పాశం శ్రీనివాస్ స్మారక స్థూపాలు వద్ద పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు డి సుధాకర్, వి పద్మజ, నిమ్మల రాంబాబు, సర్పంచులు బాబురావు, రమేష్, నాయకులు రెహమాన్, ఉప్పుశెట్టి సునీల్ కుమార్, చెరుకూరి శేఖర్ బాబు, వైఎస్ గిరి, గౌస్ పాషా, అహ్మద్ జానీ, మస్తాన్, వలపు యాకయ్య, ఇరుకులపాటి సుధాకర్, కొంగర అప్పారావు, జకరయ్య, కరీం, కిరణ్, రమేష్, వెంకన్న, అమీర్, చందూలాల్, ఆదినారాయణ, బోడా భీమా, ప్రేమచంద్, వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవి, సాయిలు శ్రీను, సాయిలి వెంకన్న, భూక్యా రమేష్, గరిగ రమేష్, భరత్, గూగులోత్ భద్రు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో భక్తిశ్రద్ధల మధ్య ఉత్సవాలు నడపండి ఎస్ ఐ శ్రావణ్ కుమార్

- ఇందు సాంస్కృతిని , సాంప్రదాయాలను కాపాడండి.
- విగ్రహాల దాత మానాల వెంకన్న




**గుండాల సెప్టెంబర్ 13 ప్రజా జ్యోతి** భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని గుండాల ఎస్సై శ్రావణ్ కుమార్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని మానాల వేంకన్న, మానాల ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో 15 వినాయక విగ్రహాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుకు తావుయకుండా క్రమశిక్షణతో జరుపుకోవాలని అన్నారు. మానాల వెంకన్న 15 గ్రామాలకు అడగకుండానే విగ్రహాలను అందజేయడం ఎంతో గర్వకారణం అని ఇలాంటి సేవా కార్యక్రమాల మరెన్నో చేయాలని కోరారు. విగ్రహాల దాత మానాల వెంకన్న మాట్లాడుతూ హిందూ సాంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఉద్దేశంతో విగ్రహాలను అందజేయడం జరుగుతుందని, అన్నారు కాగా 15 గ్రామాలలో విగ్రహాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. గుండాల కొత్త గుంపు, గుండాల సుభాష్ నగర్, గుండాల తండా, పోతిరెడ్డిగూడెం, శమ్మని గూడెం, గురుకల మడుగు, లింగగూడెం, కన్నాయి గూడెం, ముత్తాపురం, రోళ్లగడ్డ, నర్సాపురం తండా, మోదుగుల గూడెం, వెన్నెల బైలు, కస్తూర్బా పాఠశాల, తూరుబాక, చింతలపాడు, గ్రామాల ప్రజలకు అందజేయడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో మానాల నారాయణమూర్తి, మానాల ప్రభాకర్, శ్రావణ్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీశ్రీ కళావేదిక జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా జి. లక్ష్మణ్ కుమార్
- ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ అబ్దుల్ నజీర్







**చర్ల, సెప్టెంబర్ 13: (ప్రజా జ్యోతి ):** తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు కవులు, రచయితలు, కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేస్తున్న శ్రీశ్రీ కళావేదిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లాలో సాహిత్య, కళా, సాంస్కృతిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు నూతన కమిటీని ఏర్పాటు చేశారు.జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో జాతీయ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, జాతీయ ప్రణాళిక అధికారి డాక్టర్ పార్థసారథి, జాతీయ అధికార ప్రతినిధి వి. వరలక్ష్మి సాయిరాం, రాష్ట్ర కోఆర్డినేటర్ తోటమల్ల సురేష్ బాబు పాల్గొన్నారు.నూతన జిల్లా కార్యవర్గంలో అధ్యక్షుడిగా జి. లక్ష్మణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ అబ్దుల్ నజీర్, ఉపాధ్యక్షుడిగా తంగెళ్లపల్లి శంకరాచారి, జిల్లా కమిటీ కార్యదర్శిగా పోతర్లంక జయరామ్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శులుగా తోకల సాంబశివరావు, మహమ్మద్ ముస్తఫా, శ్యామ్ సునర్కాని, ఈగపాటి రంజన్, గుమ్మడపు దుర్గాప్రసాద్, ఆర్. శ్రీకృష్ణరావు, సహాయ కార్యదర్శులుగా విక్టోరియా రాణి, ఎ. ఎక్కిరాజు రాణి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జి. లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక వంటి ప్రతిష్టాత్మక సంస్థలో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ కళాకారులు, సాహితీవేత్తలకు శ్రీశ్రీ కళావేదిక చక్కటి వేదికగా నిలుస్తోందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించనున్న 176వ కవి సమ్మేళనాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఉపాధ్యక్షుడు తంగెళ్లపల్లి శంకరాచారి మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణతో పాటు యువ ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లావ్యాప్తంగా కవి సమ్మేళనాలు, సాహిత్య సభలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు.నూతన కార్యవర్గం సాహిత్య, కళా, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కవులు, రచయితలు, కళాకారులు ఆకాంక్షిస్తూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు

**చర్ల, సెప్టెంబర్ 13:(ప్రజా జ్యోతి ):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అమరవీరులను స్మరించుకుని వారికి ఘనమైన నివాళులు అర్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. 78వ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం చర్లలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.నిజాం నిరంకుశ పాలనకు తొత్తులుగా వ్యవహరించిన పటేల్, పట్వారీ, జమీందారీ, జాగీర్దారీ వ్యవస్థలను ఎదిరించి పోరాడిన కమ్యూనిస్టు గెరిల్లాలకు జోహార్లు అర్పించారు. నాటి పోరాట స్ఫూర్తిని నేటి యువతకు అందించాలని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందన్నారు.1948 సెప్టెంబర్ 17న కమ్యూనిస్టుల సాయుధ పోరాటం ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని అన్నారు .తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని హిందూ—ముస్లిం ఘర్షణలుగా చిత్రీకరించే మతోన్మాదుల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చీకటి ఒప్పందం ఫలితంగానే నిజాం రాజుకు గవర్నర్ పదవి దక్కిందని ఆరోపించారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన రద్దయిందని, పటేల్ సైనిక చర్యల వల్ల మాత్రమే కాదని స్పష్టం చేశారు. ఈ పోరాటంలో సుమారు 4,500 మంది యువకిశోరాలు ప్రాణత్యాగం చేశారని పేద ప్రజలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. అమరవీరుల ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూప పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీనారాయణ, మండల కార్యవర్గ సభ్యులు కోడిరెక్కల రాజారావు, నూప తిరుపతిరావు, పాలంచ రామారావు, పాలెం సత్యనారాయణ, ఉప్పులూరి నాగరాజు, మల్లం నాగేశ్వరరావు, కుర్నాపల్లి సర్పంచ్ శ్యామల తిరుపతిరావు, నూప రాము, నూప మురళి, మునిగేల సాయి, తోట శ్రీను, సోడి సీతారాములు, కొమరం వెంకటేశ్వర్లు, కల్లూరి సీతారాములు, మడకం సుక్కయ్య, రవ్వ పాండు, చెన్నం సాంబశివరావు, లక్ష్మి, అనసూయ, నరసింహారావు, వీరన్న, రమణ, రామయ్య, దేవయ్య, కన్నయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# పందుల దొడ్డిలో సంత

- ముక్కు మూసుకుంటూ సరుకులు కొంటున్న జనం...
- రాజీవ్ గాంధీ నగర్ లో మార్కెట్ గోదాం ఉన్నా.. పందులు తిరిగే స్థలంలో సంత ఏర్పాటు ఏంటి.?
- దుర్గంధ భరిత వాతావరణంలో సంత - పట్టించుకోని అధికారులు,ఎమ్మెల్యే...





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /సెప్టెంబర్ 13, ప్రజాజ్యోతి : –** మణుగూరులో సమితిసింగారం కాలేజీ పక్కనా ఏర్పాటు చేసిన పందుల సంతే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. పందులు నిత్యం తిరిగే, దుర్గంధం వెదజల్లే స్థలంలో సంత ఏర్పాటు చేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని రాజీవ్ గాంధీ నగర్ ఏరియాలో మార్కెట్ గోదాం ఉండగా, అక్కడ సంత ఏర్పాటు చేయకుండా పందుల దొడ్డి లాంటి ప్రదేశంలో సంతను ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పందులు తిరిగే స్థలంలో కూరగాయలు, నిత్యావసరాలు ఎలా కొనాలని కొందరు మహిళలు వాపోతున్నారు. దుర్గంధ భరిత వాతావరణం, పందుల వ్యర్థాల మధ్య సంత నిర్వహణతో అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి, సంతను రాజీవ్ గాంధీ నగర్ లోని మార్కెట్ గోదాం వద్దకు మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సెప్టెంబర్ 15న హైదరాబాదులో జరిగే సదస్సును జయప్రదం చేయండి. యాసారపు వెంకన్న



**గుండాల సెప్టెంబర్ 13 ప్రజాజ్యోతి** హమాలీలకు సమగ్ర చట్టంతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ అమాలి, మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి యాసర్పు వెంకన్న కోరారు. సెప్టెంబర్ 15న హైదరాబాదులో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు అమాలి కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులను మంజూరు చేసి వారి సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. అమాలి కార్మికులకు సంక్షేమ పథకాలను అందజేయాలని డిమాండ్ చేశారు నిత్యం బరువులు మోసి కష్టం చేస్తున్న అమాలీలకు 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నెలకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, అమాలి కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం నగేష్, చేయబోతూ రవి, మెంతిని నగేష్, సత్తు ధనరాజ్, బాల్య కిరణ్, ఆవుల సదయ్య, తాటి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## శ్యామల గోపాలన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 13,(ప్రజా జ్యోతి)** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని లక్ష్యంతో శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు, ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ "మట్టి గణపతిని పూజిద్దాం – పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను ఉపయోగించాలని పిలుపునిచ్చారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతున్న నేపథ్యంలో మట్టి గణపతి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడం ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా శ్యామల గోపాలన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నల్ల సురేష్ రెడ్డి జిల్లా ప్రజలకు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు, ఈకార్యక్రమంలో ఎన్ రాంరెడ్డి, వి రామకృష్ణ రెడ్డి, సంతోష్ రెడ్డి, ఖలీల్ పాషా, క్వాలిటీ కిరణ్,పి.జీవన్ రెడ్డి,వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామానుజవరం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఫ్యాన్సీ షాపు యువకుడికి తీవ్ర గాయాలు...
- బీటీపీఎస్ వద్ద బొలెరో - బైక్ ఢీ...
- రామానుజవరం బీటీపీఎస్ వద్ద అతివేగమే ప్రమాదానికి కారణమా..?



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 13, ప్రజాజ్యోతి :** –మణుగూరు మండలం రామానుజవరం సమీపం లోని బీటీపీఎస్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం బైక్ ను ఢీకొన్న ఘటనలో ఫ్యాన్సీ షాపు యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.ప్రమాదంలో గాయపడిన యువకుడు మణుగూరు పట్టణంలోని వరలక్ష్మి ఫ్యాన్సీలో పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ ఢీలో యువకుడి చేయి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.ప్రమాదానికి గల కారణాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మట్టి గణపతితో పాటు మొక్కలను పంపిణీ చేసిన గ్రీన్ ఎర్త్ సొసైటీ నిర్వాహకులు

- పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులచే పూజించండి
- గ్రీన్ ఎర్త్ సొసైటీ నిర్వాహకులురమేష్ రాథోడ్- బాలినేని





**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబరు 13,(ప్రజాజ్యోతి)** పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ ఎర్త్ సొసైటీ ఆధ్వర్యంలో పాల్వంచలో గత అనేక సంవత్సరాలు నుండి భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను తయారుచేసి ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను, అదేవిధంగా పూల మొక్కలను పంపిణీ చేస్తున్నారు, ఈ ఏడాది కూడా పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ ఎర్త్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం భజన మందిరం రోడ్డులో ఉచిత మట్టి వినాయక ప్రతిమలతో పాటు మొక్కలను పంపిణీ చేశారు. భారీ పరిశ్రమల కాలుష్యంతో పాల్వంచ ప్రాంతంలో పర్యావరణం దెబ్బతింటున్న నేపథ్యంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, అధిక శబ్దం కలిగించే డీజేల వినియోగానికి దూరంగా ఉండాలని నిర్వాహకులు సూచించారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకులు రమేష్ రాథోడ్ మాట్లాడుతూ మట్టి విగ్రహాల వైపే అడుగు వేద్దాం.. పర్యావరణ అనుకూల ప్రతిమలతోనే పూజిద్దాం.. ప్రకృతిని మనమే కాపాడుకుందాం'' అని పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతగా 2012 నుంచి 2026 వరకు ఉచిత మట్టి వినాయక ప్రతిమలతో పాటు మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.అలాగే ఆలయ ప్రాంగణంలో కదంబం మొక్కనీ ప్రకృతి ప్రేమికుడు వండర్ కిడ్ ఇంగ్లాండ్ బుక్ బుక్ ఆఫ్ రికార్డ్ హోల్డర్ విశ్వమిత్ర చౌహన్, సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ లు కలిసి మొక్కని నాటారు, అనంతరం చైర్మన్ బాలినేని సత్యనారాయణ మాట్లాడుతూ విపరీత సౌండ్ వద్దని నీటి వనరులు ధ్వంసం చేయవద్దని పిలుపునిచ్చారు , ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ వీరు నాయక్, పాల్వంచ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు పసుమర్తి రాము, ఎడ్లపల్లి శ్రీనివాస్, అనిల్ ఇస్లావత్, రవి నునావత్, మూడ్ జయరాం, ప్రకృతి ప్రేమికుడు బాలు నాయక్,తేజవత్ వెంకట్, దుర్గాప్రసాద్, పట్టాభి రామారావు, కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి,విరభద్రం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 28 29 30 తేదీలలో ఖమ్మంలో జరిగే ఏఐకేఎంఎస్ జాతీయమాస వలన జయప్రదం చేయండి



**గుండాల సెప్టెంబర్ 13 ప్రజా జ్యోతి** సెప్టెంబర్ 28 29 30 తేదీలలో ఖమ్మంలో జరిగే ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను. జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు తుప్పాకుల నాగేశ్వరరావు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వాల్పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన భూ చట్టాలను వ్యతిరేకిస్తూ పోరాడాలన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, పండించిన పడ్డకు రక్షణ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమవుతున్నాయన్నారు. ప్రపంచంలో వస్తువును తయారు చేసే వ్యాపారులకు ధర నిర్ణయించుకునే అధికారం ఉన్నప్పుడు, రైతు పండించిన పంటకు రైతే ధర్నా నిర్ణయించే అధికారం రావాలన్నారు. కోరం సీతారాములు, చర్పుల కిషన్, గడ్డం లాలయ్య, వ్యాసారపు వెంకన్న, పెండేకట్ల పెంటన్న, పాయం ఎల్లన్న, ఈసం కృష్ణ, లాలు, అర్రెమ్ నరేష్, మానాల ఉపేందర్, మంగన్న, నరసన్న సమ్మన్న తదితరులు పాల్గొన్నారు

## మహిళలకు కుట్టు శిక్షణ.. సర్టిఫికెట్ల పంపిణీ



**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 13,(ప్రజా జ్యోతి)** పాల్వంచ పట్టణంలోని 42వ డివిజన్‌లో మదర్ థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత రెండు నెలలుగా మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ అందించారు. ఈ శిక్షణలో మహిళలు స్వయం ఉపాధి పొందుతూ తమ కాళ్లపై తాము నిలబడేలా ఫౌండేషన్ సంధ్యా రెడ్డి విశేష కృషి అందించారు, ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన మహిళలకు డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, 5వ డివిజన్ కార్పొరేటర్ సరిత, యూత్ కాంగ్రెస్ నాయకుడు చీకటి కార్తీక్ తదితరుల చేతుల మీదుగా మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. 42వ డివిజన్ కార్పొరేటర్ దున్నపోతుల మణి, రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

## కిన్నెరసాని పర్యాటక కేంద్రానికి భారీగా తరలి వచ్చిన పర్యాటకులు

- కిన్నెర పర్యాటకానికి ఆదాయం రూ 14, వేల 580




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 13,(ప్రజా జ్యోతి)** వినాయక చవితి పండుగ సందర్భంగా పాల్వంచ మండల పరిధిలోని పర్యాటక కేంద్రానికి ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది, ఒకవైపు గణేష్ పండుగ ,మరోవైపు ఆదివారం సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లాల నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి పర్యాటకులు కిన్నెరసాని రిజర్వాయర్ ను, పర్యాటక కేంద్రాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో కిన్నెరసాని పర్యాటక కేంద్రం సందడిగా మారింది, భారీ వర్షాలకు కిన్నెరసాని రిజర్వాయర్లోకి భారీగా వరద నీరు చేరడంతో రిజర్వాయర్ నో తిలకించేందుకు డ్యాం పై పర్యాటకులు సందడి చేశారు, కొంత మంది పర్యాటకులు పర్యాటక కేంద్రంలో చిన్నపిల్లలు జింకల పార్కు వద్ద ,చిల్డ్రన్ పార్కులో ఆటలాడుతూ ఉత్సాహంగా గడిపారు, కుటుంబ సమేతంగా పిన్నెల్లి స్థానిక వచ్చిన వారు వనభోజనం మాదిరిగా భోజనాలు చేస్తూ, అదేవిధంగా బోట్ షికారు చేస్తూ ఒకరోజు ఉత్సాహంగా గడిపారు, దీంతో పర్యాటక కేంద్రానికి ఆదివారం ఒకరోజు 201 మంది పర్యాటకులు రాగా టికెట్ రూపంలో రూ 14,580 ఆదాయం సమకూరింది,

# తాగునీటి కోసం రోడ్డెక్కిన కంపగూడెం గ్రామస్తులు

- భారీగా నిలిచిపోయిన వాహనాలు
- ఎస్ఐ చొరవతో తీరిన సమస్య



**ములకలపల్లి, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి):** చౌటిగూడెం పంచాయతీ పరిధిలోని కంపగూడెం గ్రామంలో నెల రోజులుగా నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేష్ ఆధ్వర్యంలో పాల్వంచ–దమ్మపేట ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. గ్రామస్తులు గంట పాటు రోడ్డుపై బైఠాయించడంతో రహదారికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సీపీఐ నేత నరాటి రమేష్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ కు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. అధికారులు మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ మధుప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని, సమస్య పరిష్కారం అయ్యే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని గ్రామస్తులు భీష్మించుకుని కూర్చున్నారు. అనంతరం ఎంపీడీవో ఎస్ వి సత్యనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వర ప్రసాద్ తో మాట్లాడి సమస్యను ఈ రోజు సాయంత్రం వరకు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. ఈ కార్యక్రమంలో కంపగూడెం గ్రామస్తులు వెల్లం కన్నయ్య, బక్కులు, ఊకే ఆదిలక్ష్మి , పూనెం సుజాత, సబిత, రామకృష్ణ, సున్నం ఈశ్వరి, మహేశ్వరి, మమత, సుజాత, నాగమణి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**సమస్య పరిష్కరించిన అధికారులు**

గ్రామస్తులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి వేమూరి మురళి గ్రామంలో మంచి నీటి సరఫరా చేసే మోటారును మరమ్మతులు చేయించి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న ఎస్ఐ మధుప్రసాద్, స్థానిక అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# మైనార్టీ గురుకుల కళాశాల నిర్వహణపై ఆందోళన





- విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులు,గోప్యతపై ఎంపీడీవో, సర్పంచ్ ఆరా
- నిర్లక్ష్యం పై చర్యలే వంటూ ప్రశ్నలు..
- జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా: ఎంపిడిఓ

**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని సారపాకలో కొనసాగుతున్న తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాల నిర్వహణ తీరుపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జమలారెడ్డి, సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థినుల ఆరోగ్యం, వసతులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ఆదివారం వారు కళాశాలను సందర్శించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఎంపీడీవో జమలారెడ్డి, సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్,ఈవో జి.రవికుమార్ కలిసి కళాశాల పరిసరాలు,తరగతి గదులు, విద్యార్థినులు ఉంటున్న ప్రాంతాలను పరిశీలించారు.అనంతరం విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కళాశాలలోని వసతులు, ఆహారం, పరిశుభ్రత తదితర అంశాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కళాశాల పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులు చదువుకోవాల్సిన ప్రాంగణంలో కనీస పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు సక్రమంగా లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు.ఒకవైపు దోమల బెడద,మరోవైపు ఎలుకల సంచారం ఉండటం వల్ల విద్యార్థినుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థినుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించడం ఏమాత్రం సమంజసం కాదని వారు పేర్కొన్నారు.ఇప్పటికే విద్యార్థినులకు ఎలుకలు కరిచి ఆరోగ్య సమస్యలు ఎదురైన నేపథ్యంలో కళాశాల నిర్వహణపై మరింత అప్రమత్తత అవసరమని సూచించారు.విషయాన్ని గోప్యంగా ఉంచి వైద్యం అందించాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు.విద్యార్థినుల ఆరోగ్యం, భద్రత విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.కళాశాలలో సమస్యలు గతంలోనూ వెలుగుచూసినప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోవడంపై వారు ప్రశ్నలు లేవనెత్తారు.విద్యార్థినుల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే విషయాన్ని ఆరా తీశారు.స్థానిక ప్రిన్సిపాల్ నిర్వహణ తీరుపై సంబంధిత ఉన్నతాధికారి ఆర్ఎల్సీ తీసుకున్న చర్యల వివరాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.విద్యార్థినులకు అనారోగ్య పరిస్థితులు తలెత్తిన సందర్భాల్లో కారణాలను గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు సూచించారు.బాధ్యత వహించాల్సిన అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కళాశాల ప్రస్తుత నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలకు ప్రైవేట్ భవనం కూడా ఒక కారణమా అనే అంశంపై సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయ ప డ్డారు. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా భవనం, తరగతి గదులు, వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు,భద్రతా ప్రమాణాలు ఉన్నాయా లేదా అనే విషయాలపై సంబంధిత అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకుల కళాశాలలో విద్యార్థినులకు మెరుగైన విద్యతో పాటు సురక్షితమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం,పరిశుభ్రమైన వసతులు అందించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మెను ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఎంపీడీవో, సర్పంచ్ కోరారు.ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వంటశాల, తాగునీరు, భోజన ప్రదేశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

**– జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం:ఎంపిడిఓ**

సారపాక మైనార్టీ గురుకుల కళాశాలలో నెలకొన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు త్వరలో జిల్లా కలెక్టర్‌తో ప్రత్యేకంగా చర్చించనున్నట్లు ఎంపీడీవో జమలారెడ్డి, సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ తెలిపారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ కళాశాలలో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు చెప్పారు.గురుకుల కళాశాలలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, పరిశుభ్రతను మెరుగుపరచాలని, ఎలుకలు–దోమల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే కళాశాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, విద్యార్థినుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# భద్రాచలం బ్రిడ్జి రోడ్డు రక్తమోడింది...



- హైవేలో ఘోర రోడ్డు ప్రమాదం...
- లారీ ఢీకొని మహిళ దుర్మరణం...
- సినిమా హాల్ ఎదుట మహిళను చిదిమేసిన లారీ...
- అక్కడికక్కడే నుజ్జునుజ్జు అయిన మృతదేహం...
- ఆదివారం రాత్రి భద్రాచలంలో రక్తసిక్తం...
- అతివేగమే ప్రమాదానికి కారణమా..?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. /భద్రాచలం. సెప్టెంబర్ 13, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో ఆదివారం రాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని రద్దీగా ఉండే బ్రిడ్జి రోడ్డులో సినిమా హాల్ ఎదురుగా ఓ మహిళను వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది.ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. లారీ అతివేగంగా వచ్చి మహిళను ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడి, మృతదేహం నుజ్జు నుజ్జు కావడం గమనార్హం. ప్రమాద తీవ్రతకు రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉన్న మహిళను చూసి స్థానికులు హతాశులయ్యారు. ఒక్కసారిగా ఘటనా స్థలంలో భయానక వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న భద్రాచలం పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగే ఈ ప్రమాదానికి కారణమా..? లేక రాత్రి వేళ రోడ్డుపై సరైన వెలుతురు లేకపోవడం కారణమా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు కొంత సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ట్రస్మా జిల్లా కోశాధికారిగా సర్వేశ్వరరావు



**ఇల్లందు, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి)** తెలంగాణ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) జిల్లా కోశాధికారిగా పట్టణంలోని మాస్టర్ మైండ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ జక్కుల సర్వేశ్వర రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కొత్తగూడెంలోని రైస్ గ్రాండ్ బన్క్వాట్ హాల్ లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ట్రస్మా జిల్లా కోశాధికారిగా ఎన్నికైన జక్కుల సర్వేశ్వరరావుకు ఇల్లందు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘ సభ్యులు, పట్టణ పుర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.